

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,97,964
బంగారం	4 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	53 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



నైతిక విలువలతో అవినీతి అంతం

ప్రతీ ఒక్కరూ నైతిక విలువలు పాటిస్తే అవినీతిని అంతం చేయవచ్చని బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ అన్నారు. - 8లో



చిత్ర లేఖనంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

ప్రతి ఒక్కరికీ చిత్ర లేఖనంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) అధ్యక్షుడు సుధాకర పట్నాయక్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రచార రథం ప్రారంభం



సచేతన రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఓటరు కార్డు చైతన్య రథాన్ని ఆదివారం ప్రారంభించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు కార్డులు ఉన్నవారు తమ పేర్లు సరి చేసుకోవాలని సూచించారు. ప్రచార రథం జిల్లాలోని అన్ని సమితి కేంద్రాలు, పంచాయతీల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం కల్పిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, డీపీఆర్వో ప్రదీప్, ఎన్నికల విభాగం అధికారి శుభాంశు శేఖర జెన్నా తదితరులు పాల్గొన్నారు.

భూపట్టాలు పంపిణీ



అటవీ భూపట్టాలతో లబ్ధిదారులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ క్లస్టర్ హౌస్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 80 గ్రామాలకు చెందిన 150 మందికి రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అటవీ భూపట్టాలను పంపిణీ చేశారు. ఆదివాసీల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వారిని అన్నివిధాల ఆదుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మునిగుడ తహసీల్దార్ ఎం.అనురాధ, బీడీవో ప్రీతమ్ తంటి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు సుధీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న రష్మీ కులదీప్ మృతదేహం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని గాంధీ నగర్‌లో ఉంటున్న రష్మీ కులదీప్ (18) అనే యువతి తాను నివాసముంటున్న ఇంట్లో ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమీప రాజ్‌పుట్ పంచాయతీ ముఖి బిడ్డాయు గ్రామానికి చెందిన ఆమె పట్టణంలోని ఒక దుకాణంలో పనిచేస్తోంది. మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడింది. ఆమె కుటుంబ సభ్యులు దుకాణానికి వచ్చి వాకబు చేయగా అక్కడ లేకపోవడంతో, ఆమె నివాసముంటున్న ఇంటికి వెళ్లారు. అనంతరం అక్కడ ఉరివేసుకోవడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ సచీంద్ర ప్రధాన్ నేతృత్వంలో మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఘనంగా నందెమ్మ ఉత్సవాలు



జంగం వీధిలో నందెమ్మల ఊరేగింపు

పర్లాకిమిడి: పట్టణంలోని సేరివీధి, జంగం వీధుల్లో నందెమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కుమార పౌర్ణమి నుంచి పలు గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటాయి.

గాడినపడని పాడి..!



- రాష్ట్రంలో తగ్గుతున్న పాల ఉత్పత్తి
- జాతీయ స్థాయిలో 18వ స్థానం
- హెచ్చరించిన నాబార్డు

భువనేశ్వర్: రాష్ట్రంలో అవసరాలకు తగినంత పాల ఉత్పాదన లేదు. ఉత్పాదన, వినియోగం, పంపిణీ మధ్య భారీ వ్యత్యాసం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితిని త్వరగా అధిగమించాల్సి ఉందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ (నాబార్డ్) హెచ్చరించింది. పాల ఉత్పత్తి మెరుగుపరచడంతో పేద మరియు సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధికి హామీ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని సూచించింది. పాడి పరిశ్రమ రంగం వృద్ధిలో ఒడిశా ఇతర రాష్ట్రాల కంటే చాలా వెనుకబడి ఉందని పేర్కొంది.

పశువులు అధికం

రాష్ట్రంలో పాడి పశువుల సంతతికి కొరత లేదు. జాతీయ స్థాయిలో అత్యధిక సంఖ్య పాడి పశువులు ఉన్న 10 అగ్ర రాష్ట్రాల్లో ఒడిశా ఒకటి ఉంది. అయితే పాల ఉత్పాదనలో మాత్రం వెనుకంజలో పడింది. 2021–22 పాడి పశువులు, ఉత్పాదన గణాంకాల ప్రకారం పాల ఉత్పత్తి రంగంలో రాష్ట్రం 18వ స్థానంలో ఉండడం విచారకరం. రాష్ట్రంలో రోజుకు తలసరి సగటు పాల లభ్యత 144 గ్రాములకు పరిమితం అయింది. ఈ రంగంలో జాతీయ సగటు రోజుకు 444 గ్రాముల పాల ఉత్పత్తి సాగుతుంది. ఇటీవల నాబార్డు ప్రచురించిన అప్రోచ్ నోట్‌లో రాష్ట్రంలోని పాల ఉత్పాదన రంగం యొక్క దుర్భరమైన పరిస్థితిని వెలుగులోకి తెచ్చింది. జాతీయ సగటు (444 రోజుకు గ్రాములు)తో పోలిస్తే రాష్ట్రంలో తలసరి పాల లభ్యత అత్యంత తక్కువగా ఉంది. ఐసీఎంఆర్ సిఫార్సు మేరకు ప్రాథమిక పోషకాహార అవసరాల దృక్కోణం నుంచి రోజుకు 300 గ్రాముల పాల ఉత్పాదన అవసరం.


తక్కువ ఉత్పాదక స్వభావం

పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ (డీపీహెచ్‌డీ) విడుదల చేసిన ప్రాథమిక పశుసంవర్ధక గణాంకాలను ఉటంకిస్తూ రాష్ట్రంలో ఉన్న చాలా పాడి పశువులు తక్కువ ఉత్పాదక స్వభావం కలిగి ఉన్నాయని నాబార్డ్ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో పాల ఉత్పాదన రంగం వృద్ధిని వేధిస్తున్న వివిధ సమస్యలను ఎత్తి చూపింది. ప్రస్తుతం ఉన్న పశువుల సంతతిలో తక్కువ ఉత్పత్తి సామర్థ్యం, పశు గ్రాసం కొరత, పశువైద్య సేవల కొరత, సకాలంలో కృత్రిమ గర్భధారణ (ఏఐ) అసౌకర్యాలు, పాల సహకార సంఘాల క్రియాత్మక మందగించడం ప్రధాన అడ్డంకులుగా ఈ నివేదిక పేర్కొంది. 2021–22లో పాల ఉత్పాదన నివేదిక ప్రకారం సంకరజాతి పశువుల పాల ఉత్పాదన రోజుకు 6.76 లీటర్లు, దేశీయ పశువుల పాల ఉత్పాదన రోజుకు 2.66 లీటర్లు, ఇతర జాతుల పశువుల సగటు దిగుబడి రోజుకు 1.42 లీటర్లుగా సమాచారం. ఇదిలా ఉండగా జాతీయ స్థాయిలో సంకరజాతి సగటు పశువుల పాల ఉత్పాదన రోజుకు 8.32 లీటర్లు, దేశీయ పశువుల సగటు ఉత్పాదన రోజుకు 4.07 లీటర్లు, ఇతర జాతుల పశువుల జాతీయ సగటు పాల దిగుబడి రోజుకు 2.83 లీటర్లుగా ఉంది.

ప్రభుత్వ నిరాదరణ

రాష్ట్ర ప్రభుత్వ రంగ పాల ఉత్పాదన సంస్థ ఒడిశా స్టేట్ కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ (ఓంఫెడ్)కి ప్రభుత్వ ఆదరణ లేదని వాపోతుంది. పాల ఉత్పాదన, విక్రయ రంగాల్లో రాష్ట్రంలో ఓంఫెడ్ అగ్రగామి సంస్థగా చలామణి అవుతోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, క్షేత్ర స్థాయిలో మూడంచెల పాడి ఉత్పాదన సహకార సంఘాల సమాఖ్యగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏకైక సంస్థ. ఈ ప్రక్రియలో ప్రభుత్వ నిరాదరణతో పాడి రైతు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం, పాల సహకార సంఘాలు (డీసీఎస్) నిర్వహణ లోపం వంటి సమస్యలతో సతమతమవుతున్నట్లు ఓంఫెడ్ ఆవేదన వ్యక్తం చేసింది. పాల సహకార సంఘాలకు, పాడి రైతులకు చెల్లించాల్సిన సొమ్ము సకాలంలో చెల్లింపులో అవకతవకలు, పలుచోట్ల విక్రయ కేంద్రాలు ఖాయిలా పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. విక్రయ కేంద్రాలకు సహకార సంఘాల ఆధ్వర్యంలో పాలు పంపిణీ చేసేందుకు పాడి రైతులు అనాసక్తి ప్రదర్శించడంతో ఈ పరిస్థితి తాండవిస్తోంది. రాష్ట్రంలో ప్రైవేటు పాల ఉత్పాదన సంస్థలతో ధీటుగా కొనసాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓంఫెడ్‌ని శక్తివంతం చేసే దిశలో చర్యలు చేపట్టాలని నివేదిక ప్రతిపాదించింది.

పశు గణన ప్రకారం



20వ పశు గణన ప్రకారం రాష్ట్రంలోని పాడి పశువుల సంతతి 99.03 లక్షలు. దీనిలో 83.23 లక్షలు తక్కువ పాల ఉత్పాదకత దేశీయ జాతుల పశువులు ఉన్నాయి. దేశీయ పాడి పశువుల తక్కువ ఉత్పాదకతకు ప్రధాన కారణం నాణ్యమైన దాణా కొరత. ప్రస్తుతం పచ్చని దాణా కొరత 48.4 శాతం మరియు ఎండు దాణా 23.5 శాతం కొరత కొనసాగుతుందని నాబార్డ్ పేర్కొంది. రాష్ట్రంలో పాల సేకరణ ప్రక్రియకు అనుకూలమైన వ్యవస్థ లేకపోవడం పాడి రైతులను మరింత వేధిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. సాంప్రదాయేతర ప్రాంతాలు మరియు వెనుకబడిన జిల్లాల్లో పాల సేకరణ మార్గాలను బలోపేతం చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉందని ఈ నివేదిక పేర్కొంది. వ్యాధులు మరియు ప్రతికూల వాతావరణ పరిస్థితులపై అధిక నిరోధకత శక్తి కలిగిన రాష్ట్రంలోని దేశీయ జాతి పశువుల రక్షణ మరియు సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత వహించాల్సి ఉంది. పాల ఉత్పాదన, వినియోగం మరియు సరఫరా మధ్య భారీ వ్యత్యాసం కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలు మరియు పాల ఉత్పత్తుల్లో కల్తీని తనిఖీ చేయడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు పొందిన తగిన ఆహార పరీక్షా ప్రయోగశాలలు రాష్ట్రంలో లేవు. ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నాణ్యమైన పాడి పశువుల సంతానోత్పత్తి వ్యవస్థని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేయాల్సి ఉంది.

నేటి నుంచి రెండో విమాన సేవలు



జయపురం విమానాశ్రయంలో ఎగరనున్న రెండో విమానం

జయపురం: జయపురం–భువనేశ్వర్‌ల మధ్య సోమవారం నుంచి రెండో విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ విమానం ప్రతి సోమ, శుక్ర వారాల్లో ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. ఎయిర్‌లైన్ ప్రొవైడర్ ఇండియా అర్బన్ ఎయిర్ సరీ్వస్ వారు ఈ విషయం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో నడుపబడుతున్న ఈ విమాన ప్రయాణ చార్జీలు రూ.2,999లు మాత్రమే. భువనేశ్వర్‌లో ఉదయం 7.10 గంటలకు బయల్దేరి, 8.45 గంటలకు జయపురం చేరుతుంది. తిరిగి జయపురంలో ఉదయం 9 గంటలకు బయల్దేరి, భువనేశ్వర్‌కు 10.35 గంటలకు చేరుతుంది. గతంలో భువనేశ్వర నుంచి జయపురం నడుస్తున్న మొదటి విమానం వారంలో 6 రోజులు ప్రయాణికులకు సేవలు అందిస్తుండగా, నేటి నుంచి ప్రారంభం కానున్న రెండో విమానం వారంలో రెండు రోజులు సేవలు అందిస్తుంది. జయపురానికి రాజధాని నుంచి రెండో విమానం నడుపుతున్నందుకు జయపురం ప్రజలే కాకుండా, అవిభక్త కొరాపుట్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రదీప్ పాణిగ్రాహి





కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రదీప్ పాణిగ్రాహి, అబయకాంత్, ఆకాష్ కుమార్ పటక్‌లు

బరంపురం: అధికార బిజూ జనతా దళ్ పార్టీ గంజాం జిల్లా గోపాల్‌పూర్ ఎమ్మెల్యే డా.ప్రదీప్ కుమార్ పాణిగ్రాహిని సస్పెండ్ చేసినప్పటి నుంచి ఆయన చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. దీనిలో భాగంగా శనివారం మధ్యాహ్నం బరంపురం జేఎంసీఎం కోర్టుకు హాజరయ్యారు. టాటా మోటర్స్ కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని పలువురు యువకుల నుంచి లంచం తీసుకొని చీటింగ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన ఇటీవల జామిన్‌పై విడుదలై కోర్టుకు హాజరయ్యారు. గతంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా విధులు నిర్వహించిన ప్రదీప్ కుమార్ పాణిగ్రాహికి సంబంధించి వివిధ రకాల అవినీతికి కేసులను సిట్ వెలుగులోకి తెస్తోంది. ప్రదీప్ కుమార్ వియ్యాంకుడు ఏఎస్ఎఫ్ (ఇండియన్ సర్వీస్ ఫారస్ట్) ఆఫీసర్ అబయకాంత్ పాటక్ మరియు అతని కుమారుడు ఆకాష్ కుమార్ పటక్‌ల టాటా మోటర్స్ కంపెనీలో నకిలీ ధ్రువపత్రాలతో 30 మందికి లంచాలకు ఉద్యోగాలు ఇచ్చినట్లు, దీనికి ఎమ్మెల్యే పరోక్షంగా పూర్తి సహకారం అందించినట్లు క్రైమ్ బ్రాంచ్ సిట్ బృందం అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు మండియాపల్లిలోని టాటా కంపెనీ కార్యాలయంపై దాడులు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకొని, 12 మందిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం కోర్టుకు వారంతో హాజరయ్యారు.

నేహా, లోహిత్‌లకు ఘన స్వాగతం



నేహా, లోహిత్‌లను అభినందిస్తున్న పట్టణ ప్రముఖులు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగిన పదో ప్రపంచ క్రాస్ బౌ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాయగడకు చెందిన నేహా, లోహిత్ పటాన్నయక్‌లు బంగారు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారు రాయగడకు ఆదివారం రావడంతో పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నేహా, లోహిత్‌లను పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు. ఇద్దరు అక్కా, తమ్ముళ్లు బంగారు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం వారిని పట్టణంలో ఊరేగించారు. పురవీధుల మీదుగా మజ్జిగౌరి మందిరం వరకు ర్యాలీ కొనసాగింది. మజ్జిగౌరి మందిరంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అభినందించారు. వారితో కలసి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. క్రీడారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు, ఆదివాసీ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక, న్యాయవాదులు టుటు దాస్, ఎద్దు మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని ఎదురుచూడక..!



రోడ్డు నిర్మాణానికి శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

- గ్రామానికి రహదారి నిర్మించుకున్న ప్రజలు

జయపురం: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా, నిజం తెలిసి నిదుర పోకుమా అని ఒక కవి అన్నారు. నిజమే తమ గ్రామానికి రోడ్డు వేయాలని ఎంతోకాలంగా అధికారులకు, పాలకులకు ఎన్నో విజ్ఞప్తులు చేసి విసిగిపోయారు. ఇక పాలకులు రోడ్డు వేయరని భావించి నిదురపోకుండా తమ గ్రామానికి తామే రోడ్డు వేసుకోవాలని భావించారు కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి గౌధరామజీ గ్రామస్తులు. అనుకున్నదే తడువుగా గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల కాలిబాటను వెడల్పు చేసి, మట్టిని చదును చేసి రోడ్డు వేశారు. శ్రమదానం చేసినవారిలో ఊరులోని పెద్దల నుంచి పిల్లలు వరకు పాలుపంచుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో కుంభార సాంప్రదాయ 35 కుటుంబాలు ఉంటున్నామని వెల్లడించారు. తమ ప్రధాన వృత్తి కమ్మరి పని కాగా, వ్యవసాయంపైన కూడా ఆధారపడి జీవిస్తున్నామన్నారు. తమ గ్రామానికి పంచాయతీ కార్యాలయం 5 కిలోమీటర్ల దూరం కాగా, సమితి కార్యాలయం 20 కిలోమీటర్ల దూరం ఉటుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రహదారి సదుపాయాలు మెరుగుపడక అనేక ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోకి కనీసం అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో గర్భిణులు, రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. దీంతో ఇక తామే రోడ్డును నిర్మించుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు పక్కా రహదారి నిర్మించకుంటే 2024 ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

అథ్లెటిక్స్‌కు కిశోర్ చంద్రరథ్



కిశోర్ చంద్ర రథ్ (ఫైల్)

పర్లాకిమిడి: నవంబర్ 8వ తేదీ నుంచి 12 వరకు ఫిలిప్పైన్స్‌లోని న్యూ క్లార్ సిటీలో నిర్వహించనున్న 22వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–23 పోటీలకు పర్లాకిమిడి నుంచి విశ్రాంత ఎక్సైజ్ ఎస్ఐ కిశోర్ చంద్రరథ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం కోల్‌కత్తాకు పయనమయ్యాడు. కిశోర్ చంద్ర లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, 100 మీటర్ల రన్నింగ్‌లో పాల్గొంటాడు. గతంలో ఆయన జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు గెలుచుకున్నాడు. ఆయన అంతర్జాతీయ ఆసియా క్రీడలకు ఎంపికవ్వడంపై కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ రూ.50 వేల సాయం అందజేశారు.

ఎలక్టోరల్ బాండ్ల జారీకి అనుమతి

భువనేశ్వర్: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎలక్టోరల్ బాండ్ల జారీ ప్రారంభమైంది. ఈ బాండ్లు జారీ చేసేందుకు భారతీయ స్టేట్ బ్యాంకు 29 శాఖలకు అధీకృతం మంజూరు చేసింది. వీటిలో స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ ఒకటి కావడం విశేషం. ఈ శాఖ 29వ విడత ఎలక్టోరల్ బాండ్లను జారీ చేస్తుంది. ఈనెల 20వ తేదీ వరకు బాండ్ల జారీ మరియు ఎనక్యాష్ చేసేందుకు అనుమతించారు. ఎలక్టోరల్ బాండ్‌లు జారీ చేసిన తేదీ నుంచి 15 క్యాలెండర్ రోజుల వరకు చెల్లుబాటు అవుతాయి. చెల్లుబాటు వ్యవధి ముగిసిన తర్వాత ఎలక్టోరల్ బాండ్‌లు డిపాజిట్ చేసిన ఏ రాజకీయ పార్టీకి చెల్లింపు చేయబడవని స్పష్టం చేశారు. అర్హత ఉన్న రాజకీయ పార్టీ ఖాతాలో ఎలక్టోరల్ బాండ్ అదే రోజున జమ చేయబడుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఎలక్టోరల్ బాండ్‌లను అర్హత కలిగిన రాజకీయ పార్టీ అధీకృత బ్యాంకులో ఉన్న బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే క్యాష్ చేసుకుంటుందని పేర్కొంది. 2017 సంవత్సరంలో ప్రవేశపెట్టబడిన ఎలక్టోరల్ బాండ్‌లు వడ్డీ రహిత బేరర్ బాండ్‌లు మరియు ఒక వ్యక్తి, కంపెనీ లేదా సంస్థ ప్రాథమిక కేవైసీ వివరాలను అందించిన తర్వాత భారతీయ స్టేటు బ్యాంకు శాఖల నుంచి వీటిని కొనుగోలు చేయవచ్చు. రాజకీయ నిధులకు పారదర్శకత తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా రాజకీయ పార్టీలకు ఇచ్చే నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా ఎలక్టోరల్ బాండ్లను రూపొందించారు. గత లోక్‌సభ లేదా శాసన సభ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 1 శాతం కంటే తక్కువ ఓట్లను పొందిన నమోదిత రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందేందుకు అర్హులు.

ప్రతిభకు అద్దం పట్టేదే సురభి

- రాయగడ ఎమ్మెల్యే ముదులి



సురభి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముదులి తదితరులు



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో సురభి పేరిట వివిధ పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సురభి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సురభి సకల కళా వేదిక లాంటిదని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రంగంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే తమ గమ్యాన్ని చేరుకోగలరన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణ చంద్ర భోరియా మాట్లాడుతూ జిల్లాలోని 11 సమితుల్లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పోటీలను నిర్వహించామన్నారు. వీరిలో విజేతలుగా నిలిచిన 750 మంది విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఇక్కడ విజేతలుగా నిలిచేవారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు పంపిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అదనపు జిల్లా విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం సునీత భోయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాహుల్ గాంధీతో ఎంపీ ఉల్క


రాహుల్ గాంధీతో మాట్లాడుతున్న ఎంపీ ఉల్క

కొరాపుట్: రాహుల్ గాంధీతో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క సమావేశమయ్యారు. ఆదివారం కొరాపుట్ పార్లమెంటరీ స్థానం పక్కనే ఉన్న చత్తీస్‌ఘఢ్ రాష్ట్ర బస్తర్ పరిధిలోని జగధల్‌పూర్ పట్టణంలో రాహుల్‌తో ఉల్క మాట్లాడారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఉల్క ఆ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా కొనసాగుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ టిక్కెట్ల ఎంపిక నుంచి ప్రచారం వరకు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉల్క పనితీరు కాంగ్రెస్ అధిష్టానానికి నమ్మకం పెంచింది. దీంతో భారీ బహిరంగ సభ వేదిక మీద రాహుల్ ఉల్కని పిలిపించుకొని విజయావకాశాలపై చర్చలు జరిపారు.

ఉత్సాహంగా ఖోఖో జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం కేఆర్ స్టేడియంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, ఉపాధ్యక్షుడు, రోటరీ క్లబ్ ముఖ్య ప్రతినిధి పొన్నాడ రవికుమార్, చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్లను ఈ నెల 26 నుంచి నరసారావుపేట వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు జిల్లా కార్యదర్శి సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. కార్యక్రమంలో సాధు శ్రీనివాసరావు, నీలాద్రి, ఈశ్వరరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


సవర నర్సింహులు మృతదేహం

మెళియాపుట్టి: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై టి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. భావనాపురం కాలనీ చెందిన సవర నర్సింహులు(32) కుటుంబంపై బాధ్యతలేకుండా ఎప్పుడూ భార్య తేజమ్మతో గొడవ పడుతుండేవాడు. ఇంటికి కూడా సరిగ్గా వచ్చే వాడు కాదు. వారం రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయి శనివారం ఉదయం రావడంతో భార్య నిలదీయడంతో మళ్లీ వెళ్లిపోయాడు. శనివారం సాయంత్రం కక్కుకుంటూ ఇంటికి వచ్చాడు. వెంటనే పలాసలోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. తేజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, నర్సింహులు ఏదైనా విషం తాగి ఉండవచ్చని ఎస్సై రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుని మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ కూడలి సమీపంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. సుమారు 70 ఏళ్ల ఈ వృద్ధుడు మూడు రోజులుగా ఈ పరిసరాల్లోనే తిరుగుతున్నాడని, అతని పరిస్థితి చూసి స్థానికులు భోజనం పెట్టేవారని ఎస్ఐ చెప్పారు. వృద్ధుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


కాలువలో మృతదేహం

గార: మండలంలోని బలరాంపురం పంచాయతీ కూర్మనాథపురం గ్రామ సమీపంలో సాగునీటి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కాలువలో నీరు తక్కువ ఉండటంతో ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు నలుపు నిక్కరు, టీ షర్టుతో ఉన్నాడు. సీఐ ఎస్.కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణే ధ్యేయంగా...!

- ఆస్పత్రుల్లో పరిశుభ్ర వాతావరణానికి ఆదేశాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రజారోగ్య సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇటీవల కాలంలో మలేరియా, డెంగీ వంటి వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తి పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ క్యాపిటల్ హాస్పిటల్ మరియు రౌర్కెలా ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్లు మరియు అన్ని ప్రధాన జిల్లా వైద్య మరియు ప్రజారోగ్య అధికారులకు ఆదేశించింది. ఈ మేరకు ఆస్పత్రులు మరియు ఆస్పత్రి ఆవరణలో దోమల రహిత వాతావరణాన్ని నిర్వహించడానికి చర్యలు చేపడతారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ శాలిని పండిట్ లేఖ జారీ చేశారు. రోగుల సౌకర్యాలను మెరుగుపరచడానికి, ప్రజారోగ్య సౌకర్యాలతో ఆరోగ్యకరమైన మరియు పర్యావరణ అనుకూలమైన ఆస్పత్రులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని లేఖలో పేర్కొన్నారు. కాయ కల్ప కార్యక్రమం ఆదేశాల మేరకు ఆరోగ్య సేవా కేంద్రాల పరిసరాల్లో దోమలు లేని ఆస్పత్రుల క్యాంపస్ నిర్వహణకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు.

అమొ హాస్పిటల్ నిధులతో...

అమొ హాస్పిటల్ పథకం నిధులను వెచ్చించి అమొ ఆస్పత్రుల్లో కిటికీలకు దోమ తెరలను అమర్చుతారు. ఈ నిధుల వినియోగంతో అన్ని జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రులు, సబ్ డివిజనల్ ఆస్పత్రులు ఒక్కోటి చొప్పున ఫాగింగ్ మెషిన్ కొనుగోలుకు అనుమతించారు. ఎయిర్ కూలర్లు మరియు ఇతర నీటి నిల్వ పరిసరాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం అనివార్యంగా పేర్కొన్నారు. ఆస్పతుల ఆవరణలో నీటి నిల్వను తొలగించి దోమల సంతతి నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ కోసం నిర్మల్ పథకం కింద ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలచే నూనె చల్లడం వంటి కార్యకలాపాలు చేపట్టాలని తెలిపారు. ఈ ఏజెన్సీలు తరచూ ఆస్పత్రి పరిసరాల్లో పొదలు తొలగించి ఇతర పరిశుభ్రత కార్యకలాపాలు చేపడతాయి. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థల సమన్వయంతో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల్లో భాగంగా ఆస్పత్రుల చుట్టుపక్కల తరచూ సామూహిక పరిశుభ్రత డ్రైవ్ వంటి కార్యక్రమాలు చేపడతారు. అమొ హాస్పిటల్ నిధుల కింద ఆస్పత్రుల్లో దోమల నివారణ పరికరాలు, అల్ట్రాసోనిక్ దోమల నివారిణి మొదలైన వాటిని అమర్చుతారు. ప్రజారోగ్య సౌకర్యాలు దోమల రహిత వాతావరణంలో ఉండేలా కాయకల్ప, అమొ హాస్పిటల్ కార్యక్రమాల్లో భాగంగా పై చర్యలను చేపట్టాలని కమిషనర్ కమ్ సెక్రటరీ అనుబంధ అధికారులకు ఆదేశించారు.

చిత్ర లేఖనంపై అవగాహన కల్పించడమే లక్ష్యం


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: ప్రతి ఒక్కరికీ చిత్ర లేఖనంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) అధ్యక్షుడు సుధాకర పట్నాయక్ అన్నారు. స్థానిక జగన్నాథ సాగర్ ప్రాంతంలోని చిత్త బినోద ఉద్యానవనం ప్రాంగణంలో సీవా మహిళా విభాగం ఆధ్వర్యంలో చిత్ర లేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. మేము మా పర్యావరణం అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 244 మంది, కళాశాలల నుంచి 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, నరేంద్ర పటా్నయిక్, శశిభూషణ పట్నాయిక్, ప్రకాశ నాయిక్‌లు బహుమతులు అందజేశారు. పోటీల న్యాయ నిర్ణేతలుగా జుధిష్టర్ మల్లిక్, బులు అమాయిక, పి.శ్రీనివాస్, పద్మ చరణ చౌదరి, సునీల్ సాగర్, దినేష్ సాహు, ప్రభాకర మహరాణ వ్యవహరించారు. కార్యక్రమంలో సీవా మహిళా విభాగ కార్యదర్శి విజయలక్ష్మీ పాణిగ్రహి, అధ్యక్షురాలు సుమన్ ముంధ, మమతా నాయిక్, వాణి పట్నాయక్, మమతా దాస్, జయ మిశ్ర, గీతారాణి పండ, సునీత పట్నాయిక్, మధుస్మిత మహాపాత్రో, భూలక్ష్మీ ఆచారి, మమతాంజలి పాత్రో, కె.దివ్య తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో అవినీతి అంతం


జయపురం: అవినీతి నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


బరంపురం: మాట్లాడుతున్న ఎస్పీ సార్వణ్ వివేక్ తదితరులు

బరంపురం: ప్రతీ ఒక్కరూ నైతిక విలువలు పాటిస్తే అవినీతిని అంతం చేయవచ్చని బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో జిల్లా పాలన యంత్రాంగం మరియు బరంపురం విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్-2023, గుడ్ గవర్నెన్స్‌పై సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అవినీతిని అరికట్టేందుకు విజిలెన్స్ విభాగం పనిచేస్తోందన్నారు. లంచ ఇస్తే పని జరుగుతుందనే ఆలోచన ప్రజలు మానుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు నైతిక విలువలు పాటిస్తే అవినీతిని అరికట్టగలమని పేర్కొన్నారు. ఉన్నత విద్యా రిజనల్ డైరెక్టర్ లక్ష్మీకాంత్ త్రిపాఠీ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంతో అవినీతిని అరికట్టగలమని చెప్పారు. ఆర్టీఐపై ప్రజల్లో అవగాహన అసరమని పేర్కొన్నారు. బీఎంసీ కమిషనర్ సోనా జెన్నా మాట్లాడుతూ యువతతో అవినీతిని అరికట్టగలమన్నారు.


బరంపురం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో కేకే వర్సిటీ వీసీ ప్రఫుల్ల మహంతి తదితరులు పాల్గొన్నారు.

జయపురం: దేశ ప్రగతికి అడ్డుగా నిలిచిన అవినీతిని అంతమొందించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. జయపురంలోని కొరాపుట్ విజిలెన్స్ డివిజన్ ఎస్పీ పర్యవేక్షణలో దుర్నీతి నివారణ వారోత్సవం నిర్వహించారు. జయపురం రఘునాథ్ మందిర కూడలి నుంచి అవినీతికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. జయపురం సబ్ కలెక్టర్ ప్రతాప్ కుమార్ పరిడ, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాయత్‌ల బీమా సౌకర్యం విస్తరణ

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయ సేవకులకు వైద్య ఆరోగ్య బీమా పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. సేవాయత్‌ల కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం పరిమితిని రూ.30,000 నుంచి రూ. 50,000కు పెంచారు. ఉపనయనం మరియు శుద్ధి క్రియ నిర్వహణ రూ.10,000 ఆర్థిక సాయం పరిమితిని విస్తరించారు. ఉపనయనం ఆర్థిక సాయం రూ.30,000 మరియు శుద్ధి క్రియ నిర్వహణ సాయం రూ. 20,000కి పెంచారు.

వైద్య ఖర్చుల చెల్లింపు

శ్రీజగన్నాథ ఆలయం సిబ్బంది వైద్య ఖర్చుల చెల్లింపు వ్యవస్థని సరళీకరించారు. ఈ నేపథ్యంలో ఆలయ సిబ్బందికి రూ.12 వేలు వరకు ఔషధ ఖర్చులను పొందేందుకు అవకాశం కల్పించారు. లోగడ ఈ మొత్తం మూల వేతనంపై 0.65 శాతానికి పరిమితం చేశారు. ఈ నిబంధన సవరించి సిబ్బందికి వెసులుబాటు కల్పించారు. ఔషధ ఖర్చుల చెల్లింపు అరుదుగా ఎదురయ్యే అవసరం కావడంతో ప్రభావిత సిబ్బందికి మరింత చేయూతగా ఉండేందుకు ఈ మేరకు సంస్కరించినట్లు ఆలయం ప్రధాన పాలన అధికారి సీఏవో రంజన కుమార్ దాస్ తెలిపారు.

గిరిజన సంక్షేమ శాఖలో పదోన్నతులు కల్పించాలి


మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసన్న

శ్రీకాకుళం: గిరిజన సంక్షేమ శాఖలో స్కూల్ అసిస్టెంట్, పీజీహెచ్‌ల ప్రమోషన్లు చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఇప్పటికి మూడు సార్లు ఉద్యోగుల గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల గున్నంనాయుడు, రాజశేఖర్, రమణమూర్తి, పార్వతీశం, రమణ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సభ్యుల రక్తదానం


రక్తదానం చేస్తున్న సత్యసాయి యువజన విభాగం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల యువజన విభాగం ఆధ్వర్యంలో బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ సహకారంతో సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త సూర రామచంద్రరావు, యువజన విభాగం సమన్వయకర్త శివకుమార్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 10 రక్తదాన శిబిరాలు నిర్వహించామని, ఈ నెల 7న కోటబొమ్మాళి మందిరంలో 11వ రక్తదాన శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. సాయిలిక్విడ్ లవ్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బృందావనం కన్వీనర్ ఎ.ప్రసాదరావు, జోనల్ కన్వీనర్ పప్పల నాగేశ్వరరావు, నేషనల్ నారాయణ సేవ ఇన్‌చార్జి అప్పారావు, బోయిన నరసింహమూర్తి, షణ్ముఖ, శేఖర్, చరణ్, అప్పలరాజు, సుజాత, ప్రమీల బ్లడ్ బ్యాంకు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

తల్లి రుణం తీర్చుకున్న తనయ


తల్లికి తలకొరివి పెడుతున్న కుమార్తె వరలక్ష్మీ

ఇచ్ఛాపురం రూరల్: కన్న కూతురే అన్నీ తానై కన్నతల్లికి తలకొరివి పెట్టిన సంఘటన ఇచ్ఛాపురం మండలంలో నెలకొంది. కేశుపురం గ్రామానికి చెందిన బుడత సావిత్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కుమారుడు బూలోకు అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతుండటంతో తల్లి దహన సంస్కారాలకు రాలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో చిన్న కుమార్తె బుడత వరలక్ష్మీ తన తల్లికి తలకొరివి పెట్టేందుకు ముందుకు వచ్చి అంత్యక్రియలు పూర్తి చేసింది.

బుడుమూరు రాజేష్‌కు సన్మానం


రాజేష్‌ను సన్మానిస్తున్న లాకా వెంగళరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను జేఎన్‌టీయూజీవీ సిండికేట్ మెంబర్‌గా ప్రభుత్వం ఇటీవల నామినేట్ చేసిన నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు ఆదివారం విశాఖపట్నంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. రాజేష్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, కార్యదర్శి బాడాన దేవభూషణ్, పిట్ట భాగ్యచంద్ర, సురేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్గో రెవెన్యూ పెంపునకు కృషి

- ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి


కార్గో కార్యాలయం వద్ద కళాసీలతో మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీకాకుళం అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీలో భాగమైన కార్గో రవాణా ఆదాయం పెంపునకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ఆదాయం పెంచేందుకు కార్గో డెవలప్‌మెంట్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలలో పర్యటించి కార్గో ఆదాయం పెంచేందుకు ఉన్న మార్గాలను అధ్యయనం చేసి నివేదికను పీటీడీ కమిషనర్‌కు అందజేస్తుందన్నారు. 2023-2024 సంవత్సరానికి రూ.240 కోట్లు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. 2024-2025 సంవత్సరానికి రూ.500 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు, సముద్రమార్గం, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులకు, మందులకు అవకాశం ఉన్నందున ఆదాయం పెంచేందుకు కృషిచేద్దామన్నారు. వాణిజ్య సంబంధిత పార్శిల్స్‌ను కూడా సురక్షితంగా, వేగవంతంగా తక్కువ ధరలకే ఇంటి వద్దకే చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పీటీడీ ఉద్యోగులుగా మనమంతా ధర్నాలకు, నిరసనలకు దూరంగా ఉండి నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆర్టీసీ ఉద్యోగులకు కూడా జీపీఎస్ వ్యవస్థ అమలు చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజారెడ్డి ఆర్టీసీలో 35 సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేశారని, సిబ్బంది కష్టనష్టాలు తెలుసని చెప్పారు. కర్నూలు డీసీటీఎం రమణ మాట్లాడుతూ అందరి సమన్వయంతోనే లక్ష్యం సాధించగలమన్నారు. అనంతరం శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ ఆర్ఎస్ నాయుడు, ఎస్ఎం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

- 24వేల లీటర్ల బెల్లంఊట, 220 లీటర్ల సారా ధ్వంసం
- వివరాలు వెల్లడించిన సెబ్ అదనపు ఎస్పీ నాగమణికంఠ




చిన్నబుర్జోలలో సారాతయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న సెబ్ అదనపు ఎస్పీ, సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ఆదివారం నాటుసారా స్థావరాలపై అక్కడి పోలీసులతో కలిసి జిల్లా సెబ్ పోలీసులు సంయుక్త దాడులు జరిపారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ (జేడీ) విజయ నాగమణికంఠ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 24 వేల లీటర్ల బెల్లం ఊట, 220 లీటర్ల సారా ధ్వంసం చేశారు. అనధికారికంగా సారా తయారవుతున్న ఒడిషా సరిహద్దు గ్రామాలైన చిన్నబుర్జోల, పెద్దబుర్జోల, దుర్గం, ఏక్మర, మారంగిల్లో ఉన్న స్థావరాలపై దాడులు నిర్వహించారు.

దాడులు ముమ్మరం..

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు మరింత ముమ్మరం చేస్తామని సెబ్ జేడీ విజయనాగమణికంఠ 'సాక్షి'తో తెలిపారు. జిల్లాలో ఆగస్టు నుంచి అక్టోబరు వరకు 216 కేసులు నమోదు చేసి 236 మందిని అరెస్టు చేశామన్నారు. 25,390 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 5322 లీటర్ల నాటుసారాను, 33 వాహనాలను సీజ్ చేశామని వివరించారు. ఒడిశా నుంచి అక్రమ మద్యం రాకుండా దృష్టి పెట్టామని చెప్పారు. మూడు నెలల్లో 78 కేసులు నమోదు చేసి వందమందిని అరెస్టు చేశామని, 28 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. అనధికారికంగా అమ్ముతున్న వారిపై 206 కేసులు నమోదు చేసి 211 మందిని అరెస్టు చేశామని, మూడు వాహనాలు సీజ్ చేశామని వివరించారు.

గంజాయిపై నిఘా..

ఈ మూడు నెలల్లో 36.68 కిలోల గంజాయి పట్టుబడిందని, ఐదు కేసుల్లో పది మందిని అరెస్టు చేశామని అదనపు ఎస్పీ తెలిపారు. అక్రమ ఇసుక తరలింపు కేసులు 44 నమోదు చేసి 47 వాహనాలు సీజ్ చేశామన్నారు. జిల్లాలో కంచిలి మండలం శ్రీరాంపురం, పాతపట్నం, సోంపేట మండలం విక్రంపురం, జనార్దనపురం, జె.నారాయణపురం, ఇచ్ఛాపురం, మామిడిగుడ్డి (మెళియాపుట్టి మండలం), ఇచ్ఛాపురం హైవే, మెళియాపుట్టితో పాటు ఒడిస్సా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని స్థావరాలపై ఆదివారం జరిపిన దాడుల్లో సెబ్ సీఐలు డి.అనిల్‌కుమార్, బి.మురళీధర్, బి.నర్సింహమూర్తి, కె.లక్ష్మినాయుడు, ఎస్ఐలు వి.వేణుగోపాల్, జె.సంధ్యారాణి, కె.కృష్ణారావు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు


ఓ మనిషి కావాలి నాటికలో ఓ సన్నివేశం


విముక్తి నాటికలో దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఒక మనిషికి మరోమనిషి సాయం చేయడం ఇచ్చిపుచ్చుకోవడం మానవతా ధర్మమని తెలియచేసే నాటిక 'ఓ మనిషి కావాలి'. నెల్లూరు క్రాంతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నాటికను జస్టిస్ డాక్టర్ గురుగుబెల్లి యతిరాజులు సౌజన్యంతో ప్రదర్శించారు. రచన పనసాల, దర్శకత్వం తంబు సురేష్ బాబు, సంగీతం లీలామోహన్ అందించారు. యువత ఉద్యోగాలు లేక మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారో తెలియచేసే ఇతివృత్తంతో కత్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో 'విముక్తి' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. 1965-66 మున్సిపల్ హైస్కూల్, శ్రీకాకుళం పూర్వ విద్యార్థులు సౌజన్యంతో ప్రదర్శించిన ఈ నాటికకు రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు.

అలరించిన 'సురభి' మాయాబజార్


మాయాబజార్ నాటకంలో ఓ సన్నివేశం

అరసవల్లి: ఆదిత్యుని సన్నిధిలో ఆదివారం సాయంత్రం ధర్మపథంలో భాగంగా అలనాటి పౌరాణిక అద్భుతం మాయాబజార్ నాటకం అందరినీ అలరించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మపరిషత్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ 'సురభి' థియేటర్స్, శ్రీవినాయక నాట్యమండలి సంయుక్తంగా నిర్వహించిన నాటికలో కళాకారులు అద్భుతంగా నటించారు. ఇంద్రపుష్కరిణి ఆవరణలోని వైజయంతి ఉత్సవ వేదికపై జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు ఎస్.కోటేశ్వర చౌదరి, నిర్వాహక ప్రతినిధులు చంద్రమౌళేశ్వర శర్మ, లలితామణి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. పౌరాణికం అనంతరం కళాకారులను సత్కరించారు.

క్లుప్తంగా

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే జోగారావు



బలిజిపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ఈ నెల 10వ తేదీన పార్వతీపురంలో నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట మండలకేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. పార్వతీపురంలో సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చాయని, అందుకు సంబంధించి అందరం యాత్రను విజయవంతం చేద్దామని విజ్ఞప్తి చేశారు. గ్రామాలనుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి పార్టీ పెద్దలు చెప్పిన సామాజిక అంశాలను శ్రద్ధతో విని గ్రామాల్లో ప్రజలకు వాటిని వివరించాలని సూచించారు. 10వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు పార్వతీపురంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.మంగశ్రీ

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 27, 28 విజయవాడలో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలలు-కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి మంగశ్రీ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్, ప్రభుత్వ పాఠశాలలు-కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం ఎన్‌పీఆర్ శ్రామిక భవన్ (సీఐటీయూ కార్యాలయం)లో ఆదివారం జరిగింది. సమావేశంలో యూనియన్ జిల్లా బాధ్యులు బి. సుధారాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర కార్యదర్శి బి. రమణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ మహిళా కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని, వీక్లీ ఆఫ్‌లు, ప్రసూతి సెలవులు అమలు చేయాలని, యూనిఫాం, రక్షణ పరికరాలు, గ్యాస్, ప్రభుత్వమే సరఫరా చేయాలని పిల్లలకు నాణ్యమైన భోజనంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాంబాయి, అచ్చియ్యమ్మ, స్వప్న, రమాదేవి, నారాయణమ్మ, బేగం, లక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



గడ్డెయ్య (ఫైల్)

సీతంపేట: మండలంలోని జామితోట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పులిపుట్టి గ్రామానికి చెందిన గొర్లె గడ్డెయ్య (45) శనివారం రాత్రి అక్కడికక్కడే మృతిచెందాడు. తన ద్విచక్రవాహనంపై సీతంపేట నుంచి స్వగ్రామానికి ఆయన వెళ్తుండగా మార్గమధ్యంలో జామితోట మలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడి మృతిచెందినట్లు ఎస్సై నీలకంఠరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామని చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ చిన్న పత్రికలో పాత్రికేయుడిగా కొన్నేళ్లుగా ఆయన పనిచేస్తున్నాడు. మృతుడి అమ్మ అనాథ శరణాలయం నడుపుతోంది. ఆయన మృతిపట్ల పలువురు తమ సంతాపం తెలియజేశారు.

ఐదు వేల టన్నుల చెరకు క్రషింగ్

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామంలో ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఐదు వేల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు కర్మాగారం అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి ఆదివారం వెల్లడించారు. విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి చెరకును నరికేందుకు తుని, అన్నవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కూలీలు తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం రైతులు కటింగ్ ఆర్డర్లు తీసుకుని, చెరకును కోసిన వెంటనే ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని తెలిపారు.

పత్తి ఉత్పత్తిలో సంతృప్తి

- మద్దతు ధర ప్రకటనతో రైతుల్లో ఆనందం
- పార్వతీపురం మన్యం జిల్లాలో 16 వేల ఎకరాల్లో సాగు
- సరాసరిగా ఎకరాకు 6 క్వింటాళ్ల పంట దిగుబడి



లివిరిలో సాగుతున్న పత్తి పంట

భామిని: తెల్లబంగారంగా పిలిచే పత్తి పంట రైతుకు కొంగుబంగారంగా మారుతోంది. వాణిజ్య పంటలలో ప్రధాన లాభదాయక పంటగా కాటన్ ఉంది. సంప్రదాయ పంటలు గిట్టుబాటు కాకపోవడంతో నష్టాల నుంచి బయట పడడానికి రైతులు పత్తి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్టు భూములతో పాటు, పల్లం భూముల్లోనూ పత్తి సాగు విస్తరించింది. కొండకోనల్లోనూ, పోడు సాగులోనూ పత్తి పంట ప్రవేశించింది.ఆదివాసీ గిరిజనుల సైతం ప్రధాన పంటగా పత్తిని సాగుచేస్తున్నారు.

ఈ-క్రాప్‌లో పత్తి పంట నమోదైన విస్తీర్ణాన్ని సుమారు 13వేలఎకరాలుగా అధికారులు గుర్తించారు. వాస్తవంగా సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాల వరకు ఉండవచ్చు. పూర్తి స్థాయి కౌలు, ప్రభుత్వ, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో సాగుతున్న పత్తి పంట లెక్కల్లోకి రాలేదని రైతులు చెబుతున్నారు. కొండ, మెట్టప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో చేస్తున్న సాగు నమోదు కావడం లేదని అంటున్నారు.

అనుకూలంగా మద్దతు ధర..

ఈ ఏడాది ప్రభుత్వం పతి క్వింటాకు మద్దతు ధరను రూ.7,020గా ప్రకటించింది. దీంతో మార్కెట్‌లో కూడా ధర పెరిగింది. సాధారణ మార్కెట్‌లో రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర పలుకుతోంది. దీంతో పత్తి సాగు రైతులకు ఆశాజనకంగా మారింది. ప్రభుత్వం నుంచి రైతు భరోసా ఆర్థిక సహాయం అందడం, ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, మందులు, విత్తనాలు అందజేస్తుండడంతో పత్తి సాగుపై మరింత ఆసక్తి పెరుగుతోంది.

వరుస వర్షాలతో..

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ముడి పత్తి దిగుబడి తగ్గనుందని వ్యవసాయాధికారులు అంచనా. గతంలో ఎకరాకి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కీలకమైన అక్టోబర్ నెలలో వానల జాడ లేకపోవడంతో పంట దిగుబడి తగ్గనుంది. అయితే ఇప్పుడిప్పుడే పత్తి సేకరణ వేగం పుంజుకుంది. ఎకరాకి 5 నుంచి 6 క్వింటాళ్లకు దిగుబడి పడిపోవచ్చని రైతులు భావిస్తున్నారు. సరాసరిగా 6 క్వింటాళ్ల దిగుబడి రానుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ముడి పత్తిని ఆరబెడుతున్న రైతు కుటుంబం



పొలంలో సేకరించిన ముడి పత్తి బస్తాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో పత్తి సాగు వివరాలు..	
మండలం	విస్తీర్ణం(ఎకరాల్లో)
కొమరాడ	3,251.20
పాచిపెంట	2,109.93
సాలూరు	2,075.72
భామిని	2,087.65
కురుపాం	1,276.82
జి.ఎం.వలస	809.73
జి.ఎల్.పురం	754.52
మక్కువ	612.14
సీతంపేట	295.75
సీతానగరం	112.45
వీరఘట్టాం	91.75
పాలకొండ	49.95
బలిజిపేట	35.89
గురుగుబిల్లి	20.00
పార్వతీపురం	16.61

సాలూరు, రాజాంలలో కొనుగోలు కేంద్రాలు



జిల్లాలోని సాలూరు, సరిహద్దులోని రాజాంలో ఐసీసీ పత్తి కొనుగోలు కేంద్రాలున్నాయి. రామభద్రపురంలో జిన్నింగ్ మిల్లు ఉంది. ప్రభుత్వం మద్దతు ధర పెంచడం, మార్కెట్‌లోనూ గిట్టుబాటు ధర పలుకుతుండడంతో పత్తి ఉత్పత్తి తగ్గనున్నప్పటికీ రైతుకు ధర అనుకూలంగా ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లోనూ యథేచ్ఛగా పత్తిని అమ్ముకోవడానికి రైతుకు స్వేచ్ఛ ఉంది.

– రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు,

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో ఆదిత్య హృదయం, సుదర్శన అష్టకం, సుదర్శన కవచం, సుదర్శన మూలమంత్రం, ధన్వంతరి మూలమంత్ర హవనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సుందరకాండ హవనం జరిపించి రామాయణంలో పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. స్వామి వెండి మంటపం వద్ద సీతారామస్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసీదళాలతో సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం కనుల పండువగా జరిపించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, వరప్రసాద్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

బాడంగి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 బాల, బాలికల జిల్లాస్థాయి పోటీలు స్థానిక గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగాయి. ఎస్‌జీఎఫ్ విజయనగరం,మన్యం జిల్లాలకు చెందిన కార్యదర్శులు ఎల్‌వీ.రమణ, గాంధీల సమక్షంలో జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 200మంది బాలబాలికలు హాజరయ్యారు. వారిలో బాలురు16మంది, బాలికలు 16మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసిన ట్లు ఆర్గనైజర్, గురుకుల పాఠశాల పీడీ సన్యాసప్పడు చెప్పారు. ఈనెల 10నుంచి మూడురోజులపాటు ఎన్‌టీఆర్ జిల్లాలో జరుగనున్న పోటీలలో ఈ జట్లు పాల్గొననున్నట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, మాధవరావు, శ్రీనివాసరావులు క్రీడాకారుల ఎంపికలో పాల్గొన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రాంబాబు క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పించారు.



ఎంపికైన జిల్లాజట్లతో వ్యాయామ ఉపాధ్యాయులు

160 లీటర్ల సారా స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలోని వెలగవాడ-సీతంపేట రహదారిలో ఆదివారం వేకువజామున ఎస్సై బి.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్న 160 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సీతంపేట మండలం నుంచి టాటా ఇండికా కారులో వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ముందుగా పోలీసులను గమనించి కారు వదిలేసి పారిపోయారు. ఆ కారులో 16 క్యాన్‌ల్లో తరలిస్తున్న 160 లీటర్ల సారాను, వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. కారు నంబర్ ఆధారంగా పరారీలో ఉన్న నిందితులను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చెప్పారు.

18 మద్యం సీసాల పట్టివేత

భోగాపురం: మండలం కేంద్రంలోని ముక్కాం జంక్షన్‌లో పోలీసులు ఆదివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేపట్టిన సమయంలో బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 18 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. కోలాపైడిరాజు అనే వ్యక్తి మద్యం సీసాలను తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

రెండ్రోజుల ఓటర్ల అభ్యంతరాలు 12,102

● జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: గత నెల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై రెండు రోజులుగా చేపడుతున్న అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ డ్రైవ్ ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,847 బీఎల్‌ఓ కేంద్రాల్లో రెండు రోజుల పాటు ఫారం -6, ఫారం-7, ఫారం -8 అంశాల విన్నపాలు 12,102 నమోదయ్యాయని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల వారిగా వీటి వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల నుంచి స్వీకరించిన ఫారం-6, 7, 8 వినతులు				
నియోజకవర్గం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
రాజాం (ఎస్సీ)	1,121	191	283	1,595
బొబ్బిలి	1,532	310	569	2,411
చీపురుపల్లి	516	115	116	747
గజపతినగరం	939	354	314	1,609
నెల్లిమర్ల	1,252	337	309	1,898
విజయనగరం	1,415	121	825	2,361
ఎస్.కోట	845	220	416	1,481
మొత్తం	7,620	1,650	2,832	12,102

మరో 3 రోజులే డ్వాక్రా బజార్

● రూ.3 కోట్ల వరకు జరిగిన వ్యాపారం



చెక్కతో తయారు చేసిన వంట సామగ్రి ప్రదర్శన, విక్రయాలు



తూర్పుగోదావరి జిల్లా వంటకాల విక్రయాలు

విజయనగరం అర్బన్: పట్టణంలో విశేష ప్రజాదరణ పొందుతున్న అఖిల భారత డ్వాక్రా బజార్ మరో మూడు రోజులు మాత్రమే ఉంటుంది. డ్వాక్రా బజార్‌లోని వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న ఈ బజార్‌లో ఇంతవరకు రూ.3 కోట్లు దాటి వ్యాపారం సాగింది. వివిధ రకాల అలంకార వస్తువులు, హస్తకళలు, వస్త్రాలు, దుస్తులు, తినుబండారాలతో ఈ ప్రదర్శన అన్ని వర్గాలను ఆకట్టుకునేలా కొనసాగుతోంది. మనరాష్ట్రం నుంచి కాకుండా 15 రాష్ట్రాలకు చెందిన మహిళా సంఘాలు సుమారు 45 స్టాల్స్ ఇక్కడ ఏర్పాటు చేశాయి. అంతేకాకుండా బజార్ ప్రాంగణంలో ఆహ్లాదం కలిగించేందుకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందరికీ చాటి చెప్పేందుకు ప్రతి రోజు సాయంత్రం వేళలో ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతోంది. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ తెలిపారు.

రాష్ట్రస్థాయి బీబీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా పురుషులు, మహిళల జట్లు

● డిసెంబర్ 8 నుంచి 10వరకు అనంతపురంలో పోటీలు

తెర్లాం: అనంతపురంలో డిసెంబర్ 8 నుంచి 10వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన రెండు జట్లు సత్తా చాటాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.విజయకుమార్, శ్రీధర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. వాడాడ హైస్కూల్ హెచ్‌ఎం జి.సుందరరావు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పురుషులు, మహిళల జట్లనుద్దేశించి మాట్లాడారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరుపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులంతా బాగా రాణించాలని కోరారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. పీడీలు సతీష్, సింహాచలం, రమణ క్రీడాకారుల ఎంపిక చేపట్టారు. రెండు జట్లలో 24మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయగా జిల్లాలోని అన్ని మండలాల నుంచి సుమారు 60మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు.

మేధా కౌశలం చాటుదాం..రా..!

- విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కౌశల్ క్విజ్ పోటీలు
- 8 నుంచి 10 తరగతుల విద్యార్థులకు అవకాశం
- ఈనెల 6వ తేదీ రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- డిసెంబర్‌లో ప్రాథమిక, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు

పాలకొండ రూరల్: విద్యా రంగాన్ని అత్యున్నత స్థితికి చేర్చేందుకు అధికార యంత్రాంగం కృషి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ తోడ్పాటు అందిస్తోంది. తాజాగా భారతీయ విజ్ఞానమండలి (బీవీఎం), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సంకేతిక మండలి(ఏపీసీఓఎస్‌టీ) సమన్వయంతో విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన దృక్పథాన్ని పెంచే దిశగా కార్యాచరణ అమలు చేస్తోంది. భావి భారత సైన్స్ పరిశోధకులను సిద్ధం చేయదలిచిన క్రమంలో కౌశల్ సైన్స్-2023 పరీక్షలకు తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించనున్నట పోటీల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందించనున్నా రు.



పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలకు సిద్ధమవుతున్న విద్యార్థినికి సహరిస్తున్న ఉపాధ్యాయురాలు

క్విజ్ పోటీలకు బహుమతులు ఇలా..		
బహుమతులు (రూ.లలో)	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ	7,500	15,000
ద్వితీయ	6,000	12,000
తృతీయ	4,500	9,000
కన్సొలేషన్	-----	6,000

పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలకు బహుమతులు ఇలా....		
బహుమతులు (రూ.లలో)	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ	3000	5000
ద్వితీయ	2000	3000
తృతీయ	1000	2000
కన్సొలేషన్	-----	1000

8 నుంచి 10 తరగతుల మధ్య ..

జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కొనసాగించే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. అందుకు ముందుగా సదరు పోటీల్లో తలపడనున్న విద్యార్థులు వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారికి ఆన్‌లైన్ ద్వారా ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. ప్రథమస్థానంలో నిలిచిన వారిలో 36 జట్లను ఎంపిక చేసి వారికి క్విజ్ పోటీ నిర్వహిస్తారు. గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో 'విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ శాస్త్రవేత్తల కృషి' అనే అంశంపై ఈ పోటీ పరీక్ష ఉంటుంది. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందిస్తారు.

పోస్టర్ ప్రెజెంటేషన్..

8, 9 తరగతుల విద్యార్థులకు జిల్లావ్యాప్తంగా పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహిస్తారు. ఒక పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు (రెండు ప్రెజెంటేషన్‌లు) అందించేలా నిర్ణయించారు. జనరల్ థీమ్, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి, పర్యావరణం కోసం జీవన శైలి, సుస్థిరత అభివృద్ధి కోసం గ్రీన్ ఎనర్జీ, అంతరిక్షంలో ఇస్రో ప్రయాణం, డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జీవిత చరిత్ర అంశాలలో ఏదైనా ఒక అంశం ఎంచుకోవచ్చు. రెండు ప్రెజెంటేషన్‌లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో 36 పోస్టర్లు అనుమతిస్తారు. వాటిలో విజేతలకు సర్టిఫికెట్, జ్ఞాపిక, నగదు బహుమతి అందజేసి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు.

నెల 5లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



జిల్లాలో పాఠశాలల కోఆర్డినేటర్లు ఈ నెల 5వ తేదీలోగా విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్‌లో www.bvmap.org రిజిస్ట్రేషన్ చేయాలి. డిసెంబర్ 6 7, 8 తేదీల్లో ప్రాథమికస్థాయి ఆన్‌లైన్‌లో పోటీ పరీక్షలు నిర్వహిస్తారు. డిసెంబర్ 20న జిల్లా స్థాయి, 30న రాష్ట్ర స్థాయి పోటీలు చేపడతారు. పాఠశాలల సైన్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు కో ఆర్డినేటర్లుగా వ్యవహరించాల్సి ఉంటుంది. అధిక సంఖ్యలో విద్యార్థులను ఈ పోటీలకు సిద్ధం చేయాలి.

– పి.రామకృష్ణ, కౌశల్, ఆప్‌కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్, పార్వతీపురం మన్యం

ప్రతిభను ప్రోత్సహించేందుకు



గణితం, సైన్స్ విభాగాల్లో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కౌశల్ పోటీలు నిర్వహిస్తున్నారు. అన్ని పాఠశాల కోఆర్డినేటర్లు విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి. నిర్దేశించిన అంశాల్లో తర్ఫీదు అందించాలి. రెండు ప్రెజెంటేషన్లు నమోదు చేయించాలి. ముఖ్యంగా పోస్టర్ ప్రెజెంటేషన్‌పై దృష్టి సారించాలి. తరగతుల వారీగా ఉపాధ్యాయులు చొరవచూపాలి.

– కె.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం

తిరుమలకు పాదయాత్ర

- 8వ తేదీ నుంచి ప్రారంభం
- 43 రోజుల పాటు సాగనున్న యాత్ర
- ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు

శృంగవరపుకోట:

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వరుడికి మొక్కుకుని, ఎస్.కోట నుంచి తిరుమలకు పాదయాత్ర చేయనున్నట్లు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చెప్పారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ రాజకీయాల్లో ఏనాడూ చూడని విధంగా ఎన్నికల వేళ ఇచ్చిన మేనిఫెస్టోలో ప్రతి హామీని నెరవేర్చి, ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందించి, ప్రతి వర్గానికి రాజకీయ సాధికారత కల్పించిన మనస్సున్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని ప్రశంసించారు. పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నడవాలన్నా, ఆంధ్రా అభివృద్ధి జరగాలన్నా, జగనే కావాలి. జగనే రావాలి అని స్పష్టం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న ఆశయంతో పార్టీ పెద్దల అంగీకారంతో తాను పాదయాత్ర ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు బొడ్డవరలోని తన ఇంటి నుంచి యాత్ర ప్రారంభిస్తున్నానని, రోజుకు సరాసరి 20కి.మీ మేర పాదయాత్ర సాగుతుందని, 43 రోజుల్లో యాత్ర ముగించుకుని డిసెంబర్ 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజున శ్రీవారిని దర్శనం చేసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా సమావేశంలో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఐ.సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్‌లు చిన్నంనాయుడు, సూర్యారావు, కె.వెంకటరావు, సూర్యనారాయణ, యామిని, ఎంపీటీసీలు ధర్మారావు, రామచంద్రరావు, సన్యాసప్పడులతో పాటు పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



తిరుమల పాదయాత్ర కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు